క్లుప్తంగా

పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి



రైతులతో సభ్యత్వం చేయిస్తున్న ప్రవీణ్‌గౌడ్

కథలాపూర్: పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యుడు మామిడిపెల్లి ప్రవీణ్‌గౌడ్ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఆయా వాడల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను కలిసి వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటి, దేవరాజం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ విస్తరణలో భూమయ్య పాత్ర కీలకం



భూమయ్యను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్రోపాధ్యాయ సంఘం విస్తరణలో ఉపాధ్యాయుడు రాజోజీ భూమయ్య పాత్ర కీలకమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, ప్రధాన కార్యదర్శి బైరం హరి కిరణ్ అన్నారు. పదవీ విరమణ పొందిన సందర్భంగా భూమయ్య దంపతులను ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టకముందు భూమయ్య గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు చేవ చేశారని, ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన నిబద్ధత గల వ్యక్తి భూమయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, బండి శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న నరేశ్ రెడ్డి

మేడిపల్లి: మండల కేంద్రంలో పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు చిలివేరి జమున– శంకర్ కుటుంబ పరిస్థితిని సామాజిక సేవకులు గుగ్గిళ్ల రవిగౌడ్, సింగిరెడ్డి దోసిలి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా, ఆదివారం రోజున వారిని కలిసి కుటుంబ పరిస్థితి తెలుసుకుని రూ.5 వేల నగదుతో పాటు నిత్యవసరాలు అందజేశారు. భవిష్యత్తులో మరింత సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తేలు నరేశ్, రవిగౌడ్, ముంజకిషన్, దువాస కిషన్, హైమ్మద్, లక్ష్మిపతి గౌడ్, శేఖర్, గంగారాజం, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కోరుట్ల: మేడిపల్లి మండల కేంద్రంలో జగిత్యాలకు చెందిన ఓ యువకుడు ఆదివారం గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు యువకుని వద్ద సుమారు 200 గ్రాముల గంజాయి పట్టుబడ్డట్లు సమాచారం. పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

బస్సుల్లో సైన్‌బోర్డులపై ఉర్దూకు ప్రాధాన్యం ఇవ్వాలి

మెట్‌పల్లి: ఆర్టీసీ బస్సుల్లో ఉండే సైన్‌బోర్డులపై ఊర్ల పేర్లను ఉర్దూలో కూడా రాయాలని అంజుమన్ ఇసాత్–ఎ–ఉర్దూ అధ్యక్షుడు అజీజ్ కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం అజీజ్ ఆధ్వర్యంలో పలు బస్సుల సైన్‌బోర్డులపై ఉర్దూలో ఊర్ల పేర్లను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ సహకారంతో ఉర్దూలో పేర్లను రాశామని, ప్రభుత్వం అన్ని డిపోల్లో కూడా దీనిని పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీం, ఖాస్మి, షాహిద్, అహ్మద్‌ఖాన్ ఉన్నారు.

ఎన్నం కిషన్‌రెడ్డికి అవార్డు

జగిత్యాలటౌన్: జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్నం కిషన్‌రెడ్డి అంజలి మీడియా అవార్డు అందుకున్నారు. ఆలిండియా మీడియా గ్రూప్, అందరి టీవీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల నుంచి ఎన్నం కిషన్‌రెడ్డితో పాటు నక్క రాజు, గాండ్ల మధురిమ, పడాల మమత, చింత సుధీర్, రవికుమార్ ఎంపిక కాగా, వారికి హన్మకొండలో అవార్డులు అందించారు.

భౌ బోయ్.. కుక్కలు

- రాయికల్‌లో బేంబేలెత్తిస్తున్న శునకాలు
- గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్న వైనం
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు



రాయికల్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు



బల్దియాలో గజ్జితో బాధపడుతున్న కుక్క

రాయికల్: పట్టణంలో ఏ వాడలో చూసినా గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలే దర్శనమిస్తున్నాయి. వాటిని చూసి పట్టణ ప్రజలు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. కానీ పట్టణంలో కేవలం 210 కుక్కలు మాత్రమే ఉన్నట్లుగా బల్దియా అధికారులు గుర్తించారు. పట్టణంలో 12 వార్డులు ఉండగా ఇటిక్యాల ఎక్స్‌రోడ్, శివాజీఏరియా, కేశవనగర్, ఇందిరమ్మ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, కోరుట్ల క్రాసింగ్‌రోడ్, నాగారం వాడ, భీమన్నవాడ వంటి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కుక్కలే దర్శనమిస్తున్నాయి. చిన్నారులు ఆరుబయటకు వెళ్లాలంటే గుంపులు గుంపులుగా ఉన్న శునకాలను చూసి భయాందోళనకు చెందుతున్నారు. కాగా, రాయికల్ మున్సిపాలిటీలో కేవలం 210 మాత్రమే కుక్కలున్నట్లు మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో 500 నుంచి వెయ్యి కుక్కల వరకు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

కుక్కలకు అంతాగజ్జే.. పట్టించుకోని పాలకవర్గం

రాయికల్ పట్టణంలో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో వాటికి సరిపడా వైద్యం అందక రోగాల బారిన పడుతున్నాయి. రోగాల బారిన పడిన కుక్కలు కాటు వేయడంతో వాటి ప్రభావం బాధితుల్లో తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. బల్దియాలోని కుక్కలకు గజ్జి ఎక్కువగా ఉండటంతో చర్మం ఊడిపోవడం, నట్టల నివారణ మందులు లేకపోవడంతో బలహీన పడటంతో పాటు, కుక్కలకు ఎక్కువగా బూసులు తోడటం వంటివి కన్పిస్తున్నాయి. ఈ బారినపడిన కుక్కలు ఎవరినైనా కరిస్తే ఆ మనిషిలో తీవ్ర ప్రభావం పడనుంది. ఆగస్టులో 80, సెప్టెంబర్‌లో 64, అక్టోబర్‌లో 90 మంది కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైంది. కాగా, మున్సిపల్ అధికారుల దృష్టిలో మాత్రం 210 గణాంకాలే ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కాగా, విషయంపై మండల మండల పశువైద్యాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, మున్సిపల్ అధికారులు డాగ్ క్యాచ్ సిబ్బందితో కుక్కలను తీసుకువస్తే వ్యాక్సిన్ వేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, పాలకమండలి సభ్యులు స్పందించి కుక్కలను పట్టే వ్యక్తులను తెప్పించి వ్యాక్సినేషన్ వేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి



పట్టణంలో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలను చూస్తేనే పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కుక్కలంతా రోగాల బారిన పడటంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను పట్టుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– వాసం దిలీప్, రాయికల్

210 కుక్కలను గుర్తించాం



రాయికల్ పట్టణంలో 210 కుక్కలను గుర్తించాం. ముఖ్యంగా కుక్కలు వ్యాధుల బారిన పడకుండా పశువైద్యాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదు.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వార్డెన్ పెద్దులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం వసతి గృహ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచడంతో ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో వార్డెన్ పెద్దులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పెంచిన కాస్మోటిక్, మెస్ ఛార్జీలు ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చాయని, పెరిగిన చార్జీలకు అనుగుణంగా నూతన మెనూ ఏర్పాటు చేసినట్లు వారికి వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పెరెంట్స్ కమిటీ చైర్మన్ నాగమణి, సభ్యులు రాజేశం, నర్సయ్య, శేఖర్, కవిత, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన గొట్టిముక్కుల రాజమణికి అత్యవసర వైద్యం కోసం ఎల్‌వోసీ రూ. 1.50 లక్షలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు గడ్డం చిన్నారెడ్డి, పుర్కుటపు తిరుపతిరెడ్డి ఆదివారం తెలిపారు. రాజమణి కాలు ఆపరేషన్ నిమిత్తం వైద్యసాయం కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్యం చేయించుకునేందుకు వీలుగా రూ. 1.50 లక్షలు ఎల్‌వోసీ మంజూరైందన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాజమణి, ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మల్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద చిన్నారి వైద్య ఖర్చుల కోసం మండలంలోని రామన్నపేట ఎస్ఆర్‌ఐ హ్యూమన్ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జగిత్యాల పట్టణానికి చెందిన హర్షవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, వైద్య ఖర్చుల కోసం ఎస్ఆర్ఐ హ్యూమాన్ హెల్పింగ్ ఫౌండేషన్ వారు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులకు హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి



ఆర్డీవో కార్యాలయ ఆవరణలో బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలోని బీసీ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతూ 296 బీసీ కళాశాలల వసతి గృహాలు,321 గురుకులాలకు వెంటనే సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. మెస్ చార్జీల పెంపుతో సుమారు 8.06 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. బీసీ కమిషన్ అందించే నివేదికతో పాటు హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుపురం రాంచందర్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా, హృషికేశ్ పాల్గొన్నారు.

గణేశ్‌కు సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న గణేశ్

కోరుట్ల: పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు కటుకం గణేశ్‌కు అంజలి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో 2024 సేవా రత్న అవార్డు అందజేశారు. హన్మకొండలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కామిరెడ్డి రాజు కటుకం గణేశ్‌కు జాతీయ సేవారత్న 2024 అందజేశారు.

మధురిమకు కాకతీయ నంది పురస్కారం

కోరుట్ల: పట్టణానికి చెందిన గాండ్ల మధురిమకు అంజలి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో కాకతీయ నంది పురస్కారం అందజేశారు. హన్మకొండలో ఆదివారం జరిగిన పదో వార్షికోత్సవంలో గ్రూప్ చైర్మన్ కామిరెడ్డి రాజు మధురిమకు ఈ పురస్కారం అందజేశారు. పట్టణంలోని అల్లమయ్య గుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న మధురిమ కరోనా సమయంలో రోగులకు చేసిన సేవలకు గుర్తింపుగా కాకతీయ నంది అవార్డు అందజేసినట్టు గ్రూప్ చైర్మన్ కామిరెడ్డి రాజు పేర్కొన్నారు.

పూడూరులో 41 రోజుల భగవద్గీత పారాయణం



పూజలో పాల్గొన్న స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు

మల్యాల: కొడిమ్యాల మండలంలోని పూడూరులో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఏటా 41 రోజుల పాటు నిర్వహించే భగవద్గీత పారాయణం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానికులు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పదేళ్లుగా 41 రోజులపాటు భగవద్గీత పారాయణం చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుద్ధ ఏకాదశి రోజున గీతా జయంతి రోజున హోమం, అన్నదానం నిర్వహించి పారాయణం ముగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలుముల రాంరెడ్డి, ఆలయ కమిటీ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ముమ్మడి రామస్వామి, మాజీ ఎంపీపీ ముమ్మాడి లక్ష్మీనారాయణ, చింతపంటి ఐలయ్య, బండ లింగారెడ్డి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు వేముల రాజమల్లు, నరహరి, వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ కాట్నపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రాయికల్: గౌడ సంఘం అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్,కోశాధికారి బండి ప్రవీణ్‌లతో పాటు ఇటీవల ఉద్యోగాలు సాధించిన బూర్గుల శ్రీకాంత్, వెంకటేశ్, గుగ్గిళ్ల రామ్ ను గోపా రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో గోపా జిల్లా ఉపాధ్యక్షులు పొన్నం రమేశ్, మండల అధ్యక్షుడు బత్తిని నిరంజన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని బస్ డిపో చౌరస్తా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పూదరి నర్సాగౌడ్, అధ్యక్షుడిగా రంగు సంపత్, ఉపాధ్యక్షుడిగా నరేందర్, కోశాధికారిగా కుడుముల లక్ష్మణ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హైదరాబాద్ తరలిన డీఎస్పీ నాయకులు



హైదరాబాద్ వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

కథలాపూర్: హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనం కార్యక్రమానికి మండలంలోని ఆ పార్టీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. రాజకీయాల్లో, చట్టసభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపాదికన ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు నినదించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, తిరుపతి, భూమ గంగారాం, రాజేందర్, రాజేశ్, ప్రవీణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: నిబంధనలకు విరుద్ధంగా జగిత్యాల పట్టణంలోని రాంబజార్ లాంటి రద్దీ ఏరియాలో సిమెంట్ నిల్వ, అమ్మకాలు నిర్వహిస్తుండటంతో సిమెంట్ దుమ్ముతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురికావడమే కాకుండా, విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి నష్టం కలిగించే సిమెంట్ గోదాముల నిర్వహణ, విక్రయాలు పట్టణం వెలుపల నిర్వహించాలన్న నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ ,జగిత్యాల సెల్ నంబర్: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోండి



చింతకుంటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. మండలంలోని చింతకుంట, రాజారాం తండా, దుంపేట, పోసానిపేట, ఇప్పపెల్లి, కలిగోట, అంబారిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో ఉశకోల అరుణ్, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు బాలు, నాయకులు పాల్గొన్నారు.

రేచపల్లిలో..

సారంగాపూర్:మండలంలోని రేచపల్లిలో ఆదివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి మాజీ ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, నాయకులు,రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2000-2003 బ్యాచ్ కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కోరుట్లరూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న 2000–2003 పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అధ్యాపకులు క్యాతం వెంకన్న, నడికట్ల సందీప్ లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు కే.ప్రసాద్, కే.రమేశ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: పట్టణంలోని వీకేబీ గార్డెన్ ఆదివారం శారద విద్యా నిలయం ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముప్పై ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాత మిత్రులతో కలిసి ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఇరవై మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు చంద శ్రీనివాస్, గడ్డల కిరణ్, సిరిపురం శ్రీనివాస్, పెండెం మహేందర్, లవంగ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో 2002– 03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం రాయికల్ పట్టణంలోని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. 20 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకుంటూ పాఠశాలలో చదివిన సమయంలో చేసిన అల్లర్లు గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధర్మపురి: ధర్మపురిలోని సరస్వతి విద్యా నికేతన్ పిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో 2010–11 ఎస్సెస్సీ మిత్ర బృందం విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పదో తరగతిలో వారు చేసిన చిలిపి చేష్టలు, తమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.